క్లుప్తంగా

గోవులను వధిస్తే కఠినచర్యలు

వినుకొండ: బక్రీద్ పర్వదినం సందర్భంగా గోవులను, దూడలను వధిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనరు ఎమ్.సుభాష్ చంద్రబోస్ హెచ్చరించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ముస్లిం మతపెద్దలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి పనికిరాని జంతువులను మాత్రమే వెటర్నరీ వైద్యుల ధృవపత్రం పొందిన తరువాత మాత్రమే వధించుకోవాలని చెప్పారు. ఇందుకు భిన్నంగా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవన్నారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టరు / స్మాయిల్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

వినుకొండ: అక్రమంగా మద్యం విక్రయాలు జరుపుతున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన గురజాలేడు కొండలు వద్దనున్న డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సి.ఐ.శ్రీనివాసరావు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుచనున్నట్లు ఆయన తెలిపారు.

9న అరుణాచలంకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు

నరసరావుపేట: ఈనెల తొమ్మిదవ తేదీ పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరి ప్రదక్షిణకు స్థానిక ఆర్టీసీ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సుయాత్ర ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ బూదాటి శ్రీనివాసరావు గురువారం పేర్కొన్నారు. ఈ బస్సు 9వ తేదీ రాత్రి 10 గంటలకు బయలుదేరి పదోతేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శించుకుంటూ 11వ తేదీ ఉదయం నాలుగు గంటలకు అరుణాచలం చేరుతుందన్నారు. భక్తులందరూ గిరిప్రదక్షణ చేసుకొని అరుణాచలేశ్వరుని దర్శనం చేసుకున్న అనంతరం అదేరోజు సాయంత్రం బయలుదేరి 12వ తేదీ ఉదయం ఐదుగంటలకు నరసరావుపేట చేరుతుందన్నారు. కావున భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఒక్కొక్కరికీ టిక్కెట్ రూ.2550లు అని, ఇతర వివరాలకు ఫోన్ నంబర్లు 73828 96041, 73828 96038, 99592 25428 సంప్రదించాలని కోరారు.

నేడు యడ్లపాడు మండల పరిషత్ సమావేశం

యడ్లపాడు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ పిడతల ఝాన్సీసాగర్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హేమలతదేవి తెలిపారు. మండలంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరగనున్నదని, ఎంపీపీ అనుమతితో ఇతర ముఖ్య అంశాలపై కూడా చర్చించనున్నట్టు ఆమె తెలిపారు. సదరు సమావేశానికి మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, సర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా కోరారు.

పోలీసు సిబ్బందికి అండగా ఉంటా

అడిషనల్ ఎస్పీ సంతోష్



నరసరావుపేట రూరల్: నిరంతరం ప్రజా రక్షణ కోసం పాటుపడే పోలీసు సిబ్బందికి అండగా ఉంటామని జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) జేవీ సంతోష్ తెలిపారు. జిల్లాకు చెందిన హోంగార్డు టీవీకే బాజీ డిప్యుటేషన్‌పై వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తూ గురువారం ఉద్యోగ విరమణ చేశాడు. బాజీని అడిషనల్ ఎస్పీ పూలమాల, శాలువాతో సత్కరించారు. అలాగే కమ్యూనికేషన్ విభాగంలో పని చేస్తూ ఈనెల 21వ తేదీన ఉద్యోగ విరమణ చేసిన జె.చెన్నకు అడిషనల్ ఎస్పీ చేతుల మీదగా రూ.5 లక్షల చెక్‌ను అందజేశారు. హోంగార్డు ఆర్ఐ ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

గణపవరంలో దేవస్థాన నిర్మాణానికి శంకుస్థాపన



నాదెండ్ల: గణపవరం-చిలకలూరిపేట డొంక రోడ్డు కుప్పగంజివాగు సమీపంలో రూ.2 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవస్థానానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. పూజారి ఇర్లపాటి శ్రీనివాసరావు శాంతిహోమం చేశారు. నవధాన్యాలు వేసి పూజలు చేశారు. నవధాన్యాలు వేసిన కొద్దిసేపటికే పునాదిలో పాము ప్రత్యక్షం కావటంతో భక్తులు, స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. . భూమిపూజకు ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి రాధాకృష్ణ, నాయకులు మండలనేని చరణ్‌తేజ్, జనసేన ఇన్‌చార్జి తోట రాజారమేష్ పాల్గొన్నారు. కార్యక్రమాలను గణపవరం అయ్యప్పసేవా సంఘం సభ్యులు పర్యవేక్షించారు.

పదవి మిగిలింది.. 'గౌరవం' పోయింది!

- ప్రజల ఓట్లతో గెలిచినా.. ప్రభుత్వ గౌరవం దక్కట్లేదు
- 15 నెలలుగా ఎంపీటీసీలకు అందని వేతనాలు
- బిల్లులు చేశామంటున్న అధికారులు
- నగదు ఖాతాల్లోకి జమ ఎప్పుడో!



యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయం



శిలాఫలకంపై ఎంపీటీసీ ప్రొటోకాల్ పాటించని వైనం

యడ్లపాడు/ నాదెండ్ల/ చిలకలూరిపేటటౌన్: ప్రజల చేత ఎన్నుకోబడిన మండల ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యులు (ఎంపీటీసీ)లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీరి పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని చూపుతోందనే విమర్శలొస్తున్నాయి. రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారం చేపట్టి ఏడాదైనా కోసం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చకపోగా, కనీసం పాలనా వ్యవహారాలు సక్రమంగా వ్యవహరించడంలో అలసత్వం వహిస్తుంది. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను విస్మరిస్తున్నారనే విమర్శలు రావడమే ఇందుకు నిదర్శనం.

15 నెలలుగా గౌరవ వేతనాలు లేవు

మూడు మండలాల పరిధిలో 45 మంది ఎంపీటీసీ సభ్యులు, ముగ్గురు కో ఆప్షన్ సభ్యులు ఉండగా, వీరిలో యడ్లపాడు-16 మంది, నాదెండ్ల-14 మంది, చిలకలూరిపేట-15 మంది ఎంపీటీసీలు ఉన్నారు. ప్రతి ఎంపీటీసీ సభ్యునికి నెలకు రూ.3 వేలు చొప్పున ఇచ్చే గౌరవ వేతనం 15 నెలలుగా చెల్లించలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వీరికి రెండు విడతల్లో వీరికి గౌరవ వేతనం చెల్లించగా, మూడో విడతకు సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఇచ్చే అవకాశం లేకుండా పోయింది. అయితే 2024 జులై 30న కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుదీరి మొదటి వార్షికోత్సవం జరుపుకుంది. కూటమి సర్కార్ అధికారం చేపట్టాక ఇప్పటికీ రెండుసార్లు బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. అధికారులు బిల్లులు పెడుతున్నామంటూ చెబుతున్నారు కానీ, ఇప్పటి వరకు వీరి ఖాతాలకు నగదు జమ కాలేదు. ఆహ్వానం.. సమాచారం ఏదీలేదు! కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత సర్వసభ్య సమవేశాలకు హాజరు కావడం మినహా ప్రజా సమస్యలు పరిష్కరించే పరిస్థితి లేదని పలువురు ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ, మండలస్థాయిలో జరిగే వివిధ కార్యక్రమాలో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నేతలకే అధికారుల ప్రాధాన్యత కనిపిస్తోందే తప్ప, ప్రతిపక్షం మద్దతుతో గెలిచిన వారికి కనీస గౌరవం లభించని పరిస్థితి నెలకొందని ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఆహ్వానం, అభివృద్ధి పనులపై సమాచారం లేక తీవ్ర అసంతృప్తి వెల్లడవుతుంది. శిలాఫలకాలపై సైతం కొందరు ప్రొటోకాల్ పాటించడం లేదంటూ మండిపడుతున్నారు.

ఎంపీటీసీలకు ప్రొటోకాల్ లేదా?



నాదెండ్లలో గతేడాది అక్టోబర్ 14న గ్రామంలో రూ.25 లక్షల ఉపాధి నిధులతో చేపట్టిన అంతర్గత సీసీరోడ్లు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హాజరై శిలాఫలకం ఆవిష్కరించారు. కానీ అందులో ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ఎంపీటీసీ సభ్యుడి పేరు లేకపోవడం బాధాకరం. ఇదేనా కూటమి ప్రభుత్వం ఎంపీటీసీలకు ఇచ్చే గౌరవం. కేవలం సర్వసభ్య సమవేశాలలో సంతకాలు పెట్టేందుకేనా మేమున్నది.

–యల్లారావు నాదెండ్ల-2 ఎంపీటీసీ

ప్రజలచే ఎన్నికైన వారికి విలువ ఇదేనా?



టీడీపీ ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా నేటికీ ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలను ఇవ్వలేదు. పల్లె పండుగ అంటూ గ్రామాల్లో చేపట్టే పనులకు ప్రజాప్రతినిధులకు ఎలాంటి సంబంధం లేదన్నట్లుగా సమాచారం, ఆహ్వానం లేకుండా జరిగిపోతున్నాయి. కనీసం ఎక్కడ చేస్తున్నారు.. నిధులు వివరాలు తెలయపర్చక పోవడం బాధాకారం. ప్రజలచే ఎన్నుకోబడిన మాకిచ్చే విలువ ఇంతేనా.

–గుత్తి రమాదేవి, ఉన్నవ-1 ఎంపీటీసీ

ఘనంగా ప్రతిష్టా మహోత్సవాలు



రొంపిచర్ల : మండలంలో కర్లకుంట గ్రామంలో గురువారం శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠా కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రామానికి వచ్చిన బంధుమిత్రులతో తిరునాళ్ల వాతావరణం నెలకొంది. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం గ్రామంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రివేళల్లో స్వామి వారి విగ్రహం వద్ద భజనా కార్యక్రమాలు చేశారు.

8న చిన్మయ మిషన్ 75వ అమృతోత్సవ వేడుకలు

నరసరావుపేట: స్థానిక పట్టాభి రామస్వామివారి దేవస్థానంలోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు చిన్మయమిషన్ కోటప్పకొండ 75ఏళ్ల అమృతోత్సవ వేడుకల ఆహ్వాన కరపత్రాలను రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు కపిలవాయి విజయకుమార్ ఆవిష్కరించారు. కపలవాయి మాట్లాడుతూ వేడుకలను నిర్మలానంద మాతాజీచే నిర్వహించబడతాయని, పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఈ దైవకార్యక్రమంలో విశేషంగా పాల్గొని భగవద్గీత శ్లోకాల పారాయణంలో పాలు పంచుకొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మొక్కలు నాటి పర్యావరణం కాపాడటం బాధ్యత

- మొక్కలు నాటి ర్యాలీ ప్రారంభించిన డీఎంహెచ్ఓ
- వేర్వేరు ప్రాంతాల్లో మొక్కలు నాటిన అధికారులు, స్థానికులు



కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న డీఎంహెచ్ఓ



పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

నరసరావుపేట: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి ఏర్పాటుచేసిన ర్యాలీకి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నాటిన మొక్కలు రెండు మీటర్ల ఎత్తు పెరిగేంత వరకు మనుషులు, పశువుల నుంచి కాపాడాలని కోరారు. ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గించాలని సూచించారు. భూమిపైన 33 శాతం అడవులు ఉండాల్సివుండగా ఇప్పుడు కేవలం 20.8 శాతం మాత్రమే ఉన్నాయని, ఇది భూగోళానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. అందువలన మొక్కలు అందరూ నాటి చెట్లుగా పెంచేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ర్యాలీ గడియారం స్థంభం వరకు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, డాక్టర్ హనుమకుమార్, ఆశాలు పాల్గొన్నారు.

రొంపిచర్లలో....

రొంపిచర్ల: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన రొంపిచర్ల తదితర గ్రామాల్లో గురువారం 2100 మొక్కలు నాటించామని ఎంపీడీవో తెలిపారు. స్థానిక మండల పరిషత్ ఆవరణలో తహసీల్దార్ కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంపీడీవో మ్యాథ్యుబాబు, తహసీల్దార్ బండి నిర్మల పాల్గొన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల రెవెన్యూ, పంచాయతీరాజ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణం కాపాడాల్సిన బాధ్యత అందరిబాధ్యత

వినుకొండ: పర్యావరణదినోత్సవం సందరర్భంగా పట్టణంలోని ప్రభుత్వజూనియర్‌కళాశాలలో హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే జి.వి ఆంజనేయులు ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలునాటారు. రన్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. వినుకొండ రూరల్ శివాపురం గ్రామంలో అసిస్ట్, బైఫ్ సంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి సుందర్‌రెడ్డి, ఐటీసీ సౌమ్య, పాల్గొని గ్రామంలో ర్యాలీ నిర్వహించి పర్యావరణంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్ట్ కోఆర్డినేటర్ రత్నకుమారి, బైఫ్ సంస్థకోఆర్డినేటర్ వెంకట సురేష్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా చేపట్టాలి

నూజెండ్ల: మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని ఉపాధి హామీ ఏపీడీ ఈవూరి బూసిరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని వన మహోత్సవ కార్యక్రమాన్ని మండలంలో ప్రజా వైద్యశాలలో గురువారం చేపట్టారు. తొలుత గ్రామ సర్పంచ్ వీర్ల వెంకటస్వామి చేతులు మీదుగా మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఏపీడీ బూసిరెడ్డి, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ కె.శిరీషా వనమహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బూసిరెడ్డి మాట్లాడుతూ మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టాలన్నారు. పర్యావరణం కాపాడుకోవాలంటే మొక్కల పెంపకం ఏకైక మార్గమన్నారు. జిల్లాకు 60 వేల మొక్కలు అందించామన్నారు. వైద్యాధికారి పుష్పేంద్ర, ఏపీవో ఆంజనేయరాజు, మండల కో ఆర్డినేటర్ సుబ్బరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

చిలకలూరిపేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రఫాని మాట్లాడుతూ వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు చెట్లను పెంచటమే ఏకైక మార్గమని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి పరిరక్షణకు చర్యలు తీసుకుంటే పర్యావరణ పరిరక్షణ సాధ్యమౌతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరి బాబు, పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవరాశి మనుగడకు మొక్కలు అవశ్యం



బైపాస్ ఇరువైపులా మొక్కలు నాటుతున్న నేషనల్ హైవే అధికారులు, సిబ్బంది

నాదెండ్ల: వాతావరణ సమతుల్యత, జీవరాశి మనుగడకు మొక్కలు ఎంతో ఆవశ్యమని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి పరిరక్షించాలని నేషనల్‌హైవే అథారిటీ టెక్నికల్ మేనేజర్ జగదీష్ చెప్పారు. నూతన బైపాస్ వద్ద గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది నూతన బైపాస్ ప్రారంభమైందని, ప్రారంభ సమయంలోనే బైపాస్‌కు ఇరువైపులా 4 వేల మొక్కలు నాటామన్నారు. ప్రస్తుతం 150 మొక్కలు నాటామని, ప్రతి రోజూ తమ సిబ్బంది మొక్కలకు నీటిని పోసి సంరక్షిస్తారన్నారు. బైపాస్‌కు ఇరువైపులా గోడలను నిర్మిచటంతో మొక్కల ఎదుగుదలకు ఢోకా ఉండదన్నారు. వీటికోసం బోర్లు వేసి సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా నీటిని అందిస్తున్నామన్నారు. మరో నాలుగైదేళ్ళలో బైపాస్ మొక్కలతో సుందరంగా మారనుందన్నారు. కార్యక్రమంలో టీం లీడర్ సోమరాజు, పీడీ మురళీమోహనరావు, డీపీఎం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



జూనియర్‌కళాశాలలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే జీవీ



ఎండీవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న తహసీల్దార్, ఎంపీడీవో



ప్రజా వైద్యశాలలో మొక్కలు నాటుతున్న బూసిరెడ్డి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలవి ప్రజావ్యతిరేక విధానాలు

సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్



మాట్లాడుతున్న మారుతీ వరప్రసాద్

చిలకలూరిపేట: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తూ హక్కులను హరించివేస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ విమర్శించారు. పట్టణంలోని రూత్‌డైక్‌మెన్ కాలనీ శాఖ మహాసభ బుధవారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మిక హక్కులను హరించేలా దాడి కొనసాగిస్తోందని ఆరోపించారు. మతోన్మాద ఎజెండాను అమలు చేస్తూ రాజ్యాంగ హక్కులను హరించివేస్తోందని ధ్వజమెత్తారు. ఎంతో కాలం పోరాటాలతో సాధించిన కార్మిక చట్టాలను కాలరాసి వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను తీసుకురావడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చటంలో పూర్తి స్థాయిలో విఫలం చెందిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సొంత ఇల్లు లేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇచ్చి గృహ నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో మమేకమై వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూత్‌డైక్‌మెన్ కాలనీ శాఖ కార్యదర్శిగా కొమరగిరి చెంచయ్య, సహాయ కార్యదర్శిగా వేల్పూల అంజయ్యతో పాటు మరో ఏడుగురిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జగ్గాపురంలో ఘనంగా ప్రతిష్టా మహోత్సవం



హోమపూజలు చేస్తున్న దంపతులు



ధ్వజారోహణ చేస్తున్న దృశ్యం

యడ్లపాడు: జగ్గాపురం గ్రామంలో గురువారం నిర్వహించిన దేవతా విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. బీసీ కాలనీ సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సిద్ధి వినాయకుడు, సమీపంలో భారీ అభయాంజనేయ స్వామి విగ్రహాలు, ఊరిమధ్యలో సీతలాంబతల్లి (బొడ్డురాయి) విగ్రహాల ప్రతిష్ఠలు, ధ్వజారోహణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరగగా, వేదఘోష నింగిని తాకింది. ఉదయం 8:49 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమానికి గ్రామస్థులే కాకుండా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చారు. కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు కొండకావూరి అయ్యప్ప గురుకుల్, సీతారామ ప్రసాదశర్మ మార్గదర్శనంలో, ఆలయ అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, సాయిసుబ్రహ్మణ్య రాఘవశర్మ పర్యవేక్షణలో హోమాలు, వేదపారాయణం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, తహసీల్దార్ జెట్టి విజయశ్రీ, ఎంపీడీవో వి హేమలతాదేవి, చిలకలూరిపేట రూరల్ సీఐ బి సుబ్బానాయుడు, ఎస్ఐ టి శివరామకృష్ణ పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ముద్దున నాగేశ్వరరావు, పోపూరి వెంకటేశ్వర్లు (బుల్లోడు) నేతృత్వంలో గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు.

నాదెండ్లలో వైభవంగా లూథరన్ దేవాలయ పునః ప్రతిష్ట



మాట్లాడుతున్న మాజీ మంత్రి విడదల రజిని

నాదెండ్ల: నీ వలె నీ పొరుగు వారిని ప్రేమించు అన్న యేసుక్రీస్తు మాటలను ప్రతి ఒక్కరూ పాటించి సమసమాజ స్థాపనకు కృషి చేయాలని ఏఈఎల్‌సీ కార్యదర్శి ఎన్ జేసురత్నకుమార్ చెప్పారు. నాదెండ్ల చైతన్యనగర్ కాలనీ (పెద్ద ఎస్సీ కాలనీ)లో సుమారు రూ.1.50 కోట్లలో పునర్నిర్మించిన ఎపిఫానియా లూథరన్ దేవాలయం ప్రతిష్ఠ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. 1955లో నిర్మించిన చర్చి శిథిలావస్థకు చేరటంతో గ్రామస్తులు, దాతల సహకారంతో 2020 మేనెలలో పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. చర్చి ఫాదర్ బి.మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫాదర్లు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నదానం చేశారు. చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

చర్చి ప్రతిష్టలో ప్రముఖులు

మాజీ మంత్రి, చిలకలూరిపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విడదల రజిని, జీఎస్టీ రిటైర్డ్ సూపరింటెండెంట్ బి.రాజేశ్వరరావు, విశ్రాంత డీఎస్‌వో జాన్‌వెస్లీ, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, కస్టమ్స్ అధికారి గాదె శ్రీనివాసరెడ్డి, పలువురు నాయకులు హాజరయ్యారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



రొంపిచర్ల: మండలంలో సంతగుడిపాడు, రొంపిచర్ల శాఖా గ్రంథాలయాలలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు గురువారంతో ముగిశాయి. సంతగుడిపాడు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులచే పుస్తక పఠనం, ధ్యానం చేయించటం లాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు ఖాళీ సమయంలో సెల్ ఫోన్లు చూడకుండా పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. పుస్తక పఠనం వలన క్రమశిక్షణతో పాటు విజ్ఞానం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారి కె.వెంకట్రావు, గ్రామపెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



నాదెండ్ల: మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై మహిళ మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రావూరి చెంచమ్మ (45) గ్రామంలో పలువురి ఇళ్ళలో పనులు చేసుకుంటూ జీవిస్తుంది. తన కుమార్తె కుటుంబం అమీన్‌సాహెబ్‌పాలెంలో నివశిస్తుండటంతో వారితో కలిసి ఉంటోంది. గురువారం ఉదయం ఓ ఇంట్లో పనులు చేసేందుకు వెళ్ళింది. నీళ్ళు చిమ్మే క్రమంలో వేలాడుతున్న కరెంటు వైరుకు తగిలి విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

వరకట్న వేధింపులపై కేసు...

వరకట్నం వేధింపులపై నాదెండ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై జి పుల్లారావు తెలిపిన వివరాల మేరకు చందవరం గ్రామానికి చెందిన స్వర్ణలతతో బాపట్ల జిల్లా చుందూరు మండలం మున్నంగివారిపాలెం గ్రామానికి చెందిన హేమంత శివకోటిరెడ్డితో వివాహమైంది. కొద్దిరోజులకే భర్త, అత్తమామలు కలిసి అధికకట్నం తెమ్మంటూ ఒత్తిడి చేసి శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేసింది.